క్లుప్తంగా

నిందితుడికి రూ.5వేల జరిమానా

మిర్యాలగూడ టౌన్ : పోలీస్ కస్టడి నుంచి తప్పించుకున్న నిందితుడికి రూ.5వేల జరిమానా విధిస్తూ బుధవారం మిర్యాలగూడ ఒకటో అదనపు న్యాయమూర్తి బీఎస్ఎన్ సుమబాల తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే... దామరచర్ల మండలం తిమ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పుట్టలగడ్డకు చెందిన ఆగోంతు హాతిరాం మిర్యాలగూడ కోర్టులో విధులను నిర్వర్తిస్తున్న వాడపల్లి పోలీసు స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ కస్టడి నుంచి తప్పించుకున్నాడు. దీంతో కానిస్టేబుల్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పటి సీఐ భిక్షపతి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగించి చార్జీ షీట్‌నుకోర్టులో దాఖల్ చేశాడు. దీంతో నిందితుడు హాతిరాంపై నేరం రుజువు కావడంతో రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

రామస్వామి మృతి బాధాకరం

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని పాత ఊరుకు చెందిన కుంభం రామస్వామి మృతి బాధాకరమని దేవరకొండ జెడ్పీటీసీ సలహాదారుడు యుగేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం రామస్వామి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు బూడిద మల్లేశ్‌యాదవ్, ఇమ్మడి రమేశ్‌గౌడ్, జాగటి శ్రీను పాల్గొన్నారు.

రాష్ట్ర కోర్ కమిటీలో ఆరుగురికి చోటు



గుర్తింపు కార్డును అందుకుంటున్న సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : కరీంనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఇటీవల నిర్వహించిన తెలంగాణ చేనేత ఐక్య తెలంగాణ చేనేత ఐక్య వేదిక కోర్ కమిటీలో మిర్యాలగూడ నుంచి ఆరుగురికి చోటు దక్కింది. ఈ మేరకు బుధవారం తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమోహన్ ప్రకటించారు. అనంతరం నియామక పత్రాన్ని కూడా అందజేసినట్లు కోర్ కమిటీ సభ్యులు బుధవారం విలేకరులకు తెలిపారు. మిర్యాలగూడ నుంచి రాపోలు వెంకటేశ్వర్లు, రాపోలు పరమేష్, పున్నా రాములు, చిలువేరు భిక్షం, రావిరాల శ్రీనివాస్‌లు ఎంపికయ్యారు. కోర్ కమిటీకి తమ నియామకానికి అన్ని విధాలుగా సహకారం అందించిన ప్రతీ ఒక్కరికి ప కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర స్థాయి కోర్ కమిటీకి ఎంపికైన వారిని సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



హమాలీలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శంకర్‌నాయక్

త్రిపురారం : ప్రతి ఒక్కరూ చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యధికారి డాక్టర్ శంకర్ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని సత్యనారాయణపురారంలోని రైస్ మిల్లులో పనిచేసే హమాలీ వర్కర్లకు త్రిపురారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అవసరమైన మందులను అందజేశారు. రైస్ మిల్లులో పరిశుభ్రత పాటించాలని, జ్వరాల భారిన పడితే నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాళ్లవీరప్పగూడెం వాసికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న సతీశ్

మిర్యాలగూడ టౌన్ : దామరచర్ల మండలం తాళ్లవీరప్పగూడెం గ్రామానికి చెందిన రాయికింది సతీష్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నాడు. ప్రొఫెసర్ బి. నారాయణ పర్యవేక్షణలో 'నిజమాబాద్, వరంగల్ జిల్లాలో వరి పంట ఉత్పత్తి వ్యాకోచత్వం, తరహా అనుసరించి ఫలితాలు' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి సమర్పించి గ్రంథానికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ పట్టా అందజేసింది. అదే విధంగా సతీష్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా వివిధ పరిశోధనల పత్రాలను సమర్పించారు. పీజీ సమయంలో మూడు బంగారు పతకాలను కూడా కాకతీయ యూనివర్సిటీ నుంచి అందుకున్నాడు. సతీష్‌కు డాక్టరేట్ రావడంపై కుటుంబ సభ్యులు, బంధువులు, అభినందించారు.

తండాల్లో గుప్పుమంటున్న గుడుంబా

- ఎన్నికల నేపథ్యంలో బెల్ట్‌షాపులపై ఆంక్షలు
- పెరిగిన సారా విక్రయాలు
- అటవీ భూముల్లో తయారీ కేంద్రాలు
- నామమాత్రంగా తనిఖీలు



లోక్యా తండాలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్, స్థానిక పోలీసులు(ఫైల్)

త్రిపురారం : మండలంలోని తండాల్లో నాటు సారా గుప్పుమంటుంది. ఎక్సైజ్ అధికారులు, పోలీసుల నామమాత్రపు తనిఖీల వీరికి అండగా ఉంటున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తండాలలో తయారైన సారా గ్రామీణ ప్రాంతాలతో పాటుగా మండల కేంద్రానికి కూడా సరఫరా అవుతోంది. గ్రామాల్లో విచ్చలవిడిగా వెలిసిన బెల్టుషాపులు మాటునా నాటుసారాని కూడా విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని బడాయి గడ్డ, డొంకతండా, రూప్లా తండా, కుంకుడు చెట్టు తండా, లచ్య తండా, పలుగు తండా, కాపువారి గూడెం, లోక్యా తండా, అప్పలమ్మ గూడెం, మాటూర్, రాగడప గ్రామాల పరిధిలోని అటవి భూముల్లో నాటు సారా తయారీ దందా జోరుగా సాగుతుందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ తండాలు ప్రత్యేకంగా అటవీ భూములకు సమీపంగా ఉండటంతో ఆ భూముల్లో చెల్ల పొదలను సారా తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు మాత్రం తండాల్లో ఉన్న సారా తయారీ కేంద్రాలపై తూతూ మంత్రంగా దాడులు చేస్తూ ఒక్కరిపై ఇద్దరిపై కేసులు నమోదు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

బెల్లం విక్రయాలపై తనిఖీలు శూన్యం

నాటు సారా తయారీకి వినియోగించే బెల్లం నిలవ్లపై మాత్రం అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. మండల కేంద్రంలోని పలు దుఖానాల్లో బెల్లం నిల్వలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో బెల్లం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ఎక్కడైనా తనిఖీల్లో పట్టుబడినా బయటకు పొక్కకుండా వ్యాపారులు జాగ్రత్తలు పడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రధాన వ్యాపార కేంద్రాలైనా మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాలు త్రిపురారం మండలానికి అతి సమీపంలో ఉండడంతో సారా తయారీకి అవసరమైన బెల్లం, సామగ్రి అక్కడి నుంచి కూడా సరఫరా సాగుతుంది. మండలంలో పూర్తి స్థాయిలో గుడుంబా నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రతి గ్రామంలో సారా అమ్మకం కేంద్రాలు

మండల వ్యాప్తంగా 32 గ్రామాల్లో నాటు సారా యథేచ్ఛగా అమ్ముతున్నారు. గతంలో మాదిరిగా గ్రామాల్లో పోలీసులు పెట్రోలింగ్ చేయకపోవడంతో నాటు సారా అమ్మకం దందా సాగుతోంది. కొన్ని గ్రామాల్లో వీధికి ఒక్కటి చొప్పున ఉన్నట్లు తెలుస్తుంది. సాధారణ ఎన్నికల నేపథ్యంలో బెల్ట్ షాపుల్లో మందు అమ్మకాలపై ఆంక్షలు ఉండడంతో నాటు సారా అమ్మకాలు పెరిగిపోయాయి.

సారా తయారీని అరికట్టాలి



అధికారులు సారా తయారీ స్థావరాలపై నామమాత్రంగా దాడులు చేసి వదిలేయడంతో మళ్లీ కొనసాగిస్తున్నారు. కొన్ని బెల్టుషాపుల్లో కూడా సారాను విక్రయిస్తున్నారు. అధికారులు అప్పుడప్పుడు కాకుండా పూర్తి స్థాయిలో తనిఖీలు చేసి నాటు సారా తయారీని మండలంలో పూర్తి స్థాయిలో అరికట్టాలి.

\- పానుగోటి హరీశ్, బీజేవైఎం మాజీ మండల అధ్యక్షుడు, త్రిపురారం

విస్తృతంగా తనిఖీలు చేపట్టాలి



అధికారులు సారా బట్టీలపైనే కాకుండా దుఖా నాల్లో నిల్వ ఉంచే బెల్లంపై కూడా విస్తృతంగా తనిఖీలు చేయాలి. దాడులు చేసినా ఎలాంటి కేసులు నమోదు చేయకుండా వదిలేయడతో తిరిగి మళీ సారా తయారీ చేస్తున్నారు. ఇప్పటికైనా పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో గ్రామాల్లో నాటు సారా తాగడంతో అల్లర్లు జరిగే ప్రమాదం ఉంది.

\- కసిరెడ్డి నరేష్, యువజన కాంగ్రెస్ నాయకులు, త్రిపురార.

ప్రతి తండాల్లో తనిఖీలు చేస్తున్నాం

స్థానిక పోలీసులతో కలిసి మండలాల పరిధిలోని ప్రతీ తండాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాం. నాటు సారా తయారీ కేంద్రాలను గుర్తించి ధ్వంసం చేస్తున్నాం. సారా తయారు చేయడంతో పాటుగా అమ్మిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. సాధారణ ఎన్నికల నేపథ్యంలో సారా అమ్మితే కఠిన చర్యలు తప్పవు.

\- కల్పన, ఎక్సైజ్ సీఐ, హాలియా

బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి : బీఆర్ఎస్ గెలుపుకోసం గ్రామ స్థాయి నుండి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని అంగడిపేట వద్ద నూతన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతు సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమన్నారు. వ్యవసాయ రంగంలో రైతులకు అన్ని విధాలుగా సాయం చేసిన ఏకైన ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. దేవరకొండ ఖిల్లాపై మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. అంతకుముందు మండల కేంద్రంలో ధర్మాపురం లచ్చయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బిల్యానాయక్, ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వల్లపురెడ్డి, ముచ్చర్ల ఏడుకొండల్‌యాదవ్, అంజిరెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, తోటకూరి పరమేష్, శీలం శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీ వీడిన వారితో బీఆర్ఎస్‌కు నష్టం లేదు



మాట్లాడుతున్న జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు

గుర్రంపోడు : జెడ్పీటీసీతోపాటు మరో పదిమంది సర్పంచ్‌లు, వారి అనుచరులు పార్టీ వీడినా బీఆర్ఎస్‌కు ఎలాంటి నష్టం లేదని జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం గుర్రంపోడులో పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు బీఆర్ఎస్‌కు , బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కాంగ్రెస్‌కు ఓట్లు వేసిన చరిత్ర వారిదని, నిత్య అసమ్మతీవాదులుగా గ్రూపు రాజకీయాలు నడుపుతూ నమ్మిన జిల్లా మంత్రి జగదీష్‌రెడ్డికి వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. ఆత్మాభిమానం ఎన్నికలప్పుడే గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. పది మంది సర్పంచ్‌లు పార్టీ వీడినా కాంగ్రెస్ పార్టీ కంటె తమ సంఖ్యాబలమే ఎక్కువ అని అన్నారు. మండలంలో బీఆర్ఎస్ పటిష్టంగా ఉందని నోముల భగత్‌కు భారీ మెజార్టీ ఖాయమన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ వజ్జ రామేశ్వరీ ధనుంజయ, మండల ప్రధాన కార్యదర్శి రామగిరి చంద్రశేఖర్‌రావు, మేకల వెంకట్‌రెడ్డి, దైద శ్రీనివాస్‌రెడ్డి, బొజ్జయ్య, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే భాస్కర్‌రావు



మిర్యాలగూడ టౌన్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ టౌన్ : గ్రామాల సమగ్రాభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే భాస్కర్‌రావు అన్నారు. బుధవారం దామరచర్ల మండలంలోని కేశవాపురం, రామోజీతండా, లావూరి బిక్యాతండా, నూనావత్‌తండా గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో 500తండాలను పంచాయతీలు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలనారన్నారు. రూ.కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. పదేళ్లకు ముందు గ్రామ వీధుల్లో తిరగలేని పరిస్థితి ఉండేదని, నేడు గ్రామాలన్ని పచ్చగా కళలాడుతున్నాయన్నారు. తాను పదేళ్లుగా నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి తనకేంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. రాబోయే రోజుల్లో మరింతగా నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, ఎంపీపీ నందినిరవితేజ, జెడ్పీటీసీ ఆంగోతు లలితహాతిరాం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బైరం బుచ్చయ్య, వైస్ చైర్మన్ కుందూరు వీరకోటిరెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సర్పంచులు సైదానాయక్, దస్లీ, శ్రీనునాయక్, నాయకులు సీతారాములు, లింగానాయక్, మాలోతు శ్రీనునాయక్, సాయన్న, ఆడోతు శోభన్‌బాబు, మనోహర్, నగేష్‌లతో పాటు పలువురు నాయకులు తదితరులున్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు



స్ట్రాంగ్‌రూం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ

దేవరకొండ : రాబోయే సాధారణ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు తెలిపారు. బుధవారం దేవరకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూం, సీసీ కెమెరాల ఏర్పాట్లను ఆయన దేవరకొండ డీఎస్పీ గిరిబాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పోలీస్ అధికారులకు వారు పలు సూచనలిచ్చారు. ఎన్నికల విధులను అధికారులు సమర్ధంతంగా నిర్వహించాలన్నారు.ఎన్నికల సంఘం, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల ఏర్పాట్లను ముమ్మరం చేసినట్లు తెలిపారు. వారి వెంట ఆయా శాఖల అధికారులున్నారు.

పోలింగ్ బూత్ పరిశీలన

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని బోయగూడెం, తిరుమలగిరి, కొంపల్లి, తూటిపేటతండా, రంగుండ్ల తండాల్లోని పోలింగ్ భూతులను బుధవారం ఎంపీడీఓ ఖాజా అస్గర్‌ఆలీ, పంచాయితీరాజ్ ఏఈ సైదలు, ఎంపీఓ పద్మ పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ బూతుల్లో సౌకర్యాలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఆయా పోలింగ్ బూతుల్లో కల్పించాల్సిన సౌకర్యాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలి పారు. మండలంలో మొత్తం 44 పోలింగ్ బూతుల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.

జస్టిస్ ఉజ్జిని భాస్కరరావుకు నివాళి

దేవరకొండ : హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జిని భాస్కరరావు మృతికి దేవరకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు బుధవారం కోర్టు ఆవరణలో నివాళులర్పించి సంతాపం తెలిపారు. 1961లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయిన జస్టిస్ ఉజ్జిని భాస్కరరావు మొదట దేవరకొండ కోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారని సీనియర్ న్యాయవాది నెమ్మికంటి గౌరీశంకర్ గుర్తు చేశారు. జిల్లా జడ్జిగా, హైకోర్టు న్యాయమూర్తిగా దేవరకొండ కోర్టు అభివృద్ధికి సహాయ సహకారాలు అందించడంతో పాటు ఇక్కడి న్యాయవాదులను ఆయన అభిమానించేవారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పి.రవీందర్, న్యాయవాదులు ఉమామహేశ్వర్, గాజుల ఆంజనేయులు, ముస్తాక్ అహ్మద్, మాడెం రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రగతి పథంలో నడిపించాలి



మిర్యాలగూడ టౌన్ : ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళా కండక్టర్లు

మిర్యాలగూడ టౌన్ : ప్రగతి చక్ర పురస్కారాలు పొందిన ఉద్యోగులు మరింత ఉత్సాహంతో ముందుకు వెళ్లి ఆర్టీసీని ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి సూచించారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో నిర్వహించిన ప్రగతి చక్ర పురస్కారాల ప్రదానోత్సం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో బడికి వెళ్లి చదువుకోని గ్రూప్–1 హోదాను సాధించగలిగానని తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డీఎం పాల్ మాట్లాడారు. పలువురు డ్రైవర్లు, కండక్టర్లు ప్రశంస పత్రాలతో పాటు నగదు ప్రోత్సాహకాలను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ సంధ్యారాణి, ఎంఎఫ్ కుమార్ రెడ్డి తదితరులున్నారు.

బస్టాండ్ ఆవరణలో బతుకమ్మ సంబరాలు

ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బుధవారం రాత్రి ఆర్టీసీ మహిళా కండక్టర్లు, ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. మహిళా కండక్టర్లు, ఉద్యోగులు రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు తీసుకవచ్చి బతుకమ్మ పాటలు పాడుతూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో హిళలు ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్, ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి, అసిస్టెంట్ డిపో మేనేజర్ సంధ్యారాణి, ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు రామావతారం, ఎక్బాల్, పద్మ, లక్ష్మమ్మ, పార్వతి, భారతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం



హాలియా : ప్రచారం చేస్తున్న మహిళ నేతలు

హాలియా : కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే ప్రజా సంక్షేమం సాధ్యమని జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు గోపగాని మాధవి అన్నారు. బుధవారం నాగార్జునసాగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ సువర్ణ, పార్లమెంట్ ఇన్‌చార్జ్ త్రిపుర సుందరితో కలిసి హాలియా పట్టణంలో ఆరు గ్యారంటీ పథకాలపై ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను గడపగడపకు తీసుకెళ్లి ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జాను, నిడమనూరు జెడ్పీటీసీ రామేశ్వరీ, హాలియా వైస్ ఎంపీపీ మాలే అరుణసత్యనారాయణరెడ్డి హాలియా, నిడమనూరు, త్రిపురారం, అనుముల మండలాల మహిళా అధ్యక్షురాలు రంగమ్మ, ఎండీ చందు, పద్మ, ఎస్ పద్మ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

కొండమల్లేపల్లి : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని కొండమల్లేపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముడావత్ మంగ్యానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని ఆంబోతుతండా, మేఘ్యతండాలలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో డోర్ టూ డోర్ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సురేష్, ఎండి.ఖదీర్, రమావత్ సేవానాయక్, రమేశ్ నాయక్, చేపూరి కార్తిక్, పసుపులేటి శివ, ఫణి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



విజయభాస్కర్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి

త్రిపురారం : మండలంలోని బాబుసాయి పేట గ్రామ పీఏసీఎస్ చైర్మన్ గోపగాని విజయ భాస్కర్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి తన అనుచరులతో కలిసి మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, నాగార్జున సాగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. పీఏసీఎస్ చైర్మన్ విజయ భాస్కర్‌కు జానారెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు అధితరులు ఉన్నారు.

బెల్ట్‌షాపులపై దాడులు



మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

నాగార్జునసాగర్ : రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నందికొండ మున్సిపాలిటీలోని బెల్ట్‌షాపులపై బుధవారం విజయపురిటౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. సుమారుగా రూ.7వేల విలువ చేసే మద్యాన్ని పట్టుకోని సీజ్ చేసినట్లుగా ఎస్ఐ సంపత్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు బెల్ట్‌షాపుల యజమానులపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.

కిశోర్‌కుమార్‌కు జాతీయ పురస్కారం

నల్లగొండ టౌన్ : సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్ఐగా పనిచేస్తున్న డాక్టర్ పల్లె కిశోర్ కుమార్‌కు పుడమి సాహితీ వేదిక సంఘమిత్ర జాతీయ పురస్కారం అందజేసింది. మాతృభాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణంలో భాగంగా కళ, విద్యా, వైద్య రంగాల్లో విశేష కృషి చేసినందుకు వేదిక ఈ అవార్డును ప్రకటించింది. బుధవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కిశోర్‌కుమార్‌కు వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ బాల్‌రెడ్డి, డాక్టర్ రాజాయోనా, ప్రిన్సిపాల్ కమిషన్ ఆఫ్ కస్టమ్స్ ఎస్‌కె రహమాన్, డి.నాగేశ్వర్‌రావు, డి.రాజేశ్వర్ రావు, డాక్టర్ బెన్‌హర్ మద్దిరాల, శేషాసాయి అవార్డు అందజేసి సత్కరించారు.

నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

దేవరకొండ : రాష్ట్రంలో నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం దేవరకొండలో నిర్వహించిన ఆ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తిరిగి మళ్లీ ఆచరణకు సాధ్యం కానీ హామీలిస్తూ ప్రజలను మభ్యపెడుతుందని ఆరోపించారు. ఈ సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ ఏటి కృష్ణ, కర్నాటి సురేష్,లాలునాయక్, చెనమోని రాములు, కళ్యాణ్‌నాయక్, నరసింహారావు, గాజుల మురళి, రాధిక, నీల రవినాయక్, తదితరులున్నారు.

కేంద్ర సంక్షేమ పథకాలే బీజేపీని గెలిపిస్తాయి

త్రిపురారం : కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వ పాలనలో ప్రజలు అందజేస్తున్న అభివృద్ధి ప్రజా సంక్షేమ పథకాలనే ఎన్నికల్లో బీజేపీని భారీ మెజార్టీతో గెలిపిస్తామని నాగార్జున సాగర్ నియోజక వర్గ బీజేపీ ఇన్‌చార్జ్ డాక్టర్ రవికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని బొర్రాయిపాలెం, రాజేంద్ర నగర్, బుడ్డి తండా గ్రామాల్లో బీజేపీ పథకాలపై కరపత్రాలు పంచుతూ ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి చేసే పార్టీలకు ఓటర్లు మద్దతు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మేదరి సైదులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ ఎర్రబోయిన శ్రీను, వల్లపు రవి, బోడ్డు రాజు, ధనావత్ జాను, రవి, నగేష్, రమావత్ లచ్చు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

రామగిరి(నల్లగొండ), నకిరేకల్ : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఎస్ఓ వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం తిప్పర్తి మండలం అంతాయిగూడెం, తానేదార్‌పల్లి, పజ్జూరులో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, నకిరేకల్ మండలం తాటికల్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో చీమలగడ్డలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్ఓ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో రాష్ట్రంలోనే మొదటిగా మన జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. ఈ నెల 20 నుంచి జిల్లావ్యాప్తంగా ధాన్యం కేంద్రాలను ప్రారంభించి కొనుగోలు చేస్తామన్నారు. తాలు, మట్టిపెడ్డలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని తెచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. అన్ని కేంద్రాల్లో గన్నీ బ్యాగ్‌లు అందుబాటులో ఉంచామని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే దగ్గరలోని మిల్లులకు తరలించాలని ఆదేశాలు జారీ చేశామని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో సివిల్ సప్లయ్ డీఎం నాగేశ్వరరావు, డీపీఎం రామలింగయ్య, ఏపీడీ సరస్వతి, ఏపీఎం శ్రీదేవి, డీటీఎస్ జ్యోతి, తాటికల్ పీఏసీఎస్ సీఈఓ జగన్‌రెడ్డి, సిబ్బంది సైదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



మహేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని 46వ వార్డు కలాల్‌వాడకు చెందిన నక్క మహేష్ ఇండియన్ నేవీ అగ్నివీర్‌కు ఎంపికైన సందర్భంగా మహేష్ బీసీ సంఘం ఆధ్వర్యంలో సత్కరించి మాట్లాడారు. అలాగే మహేశ్‌ను, వెంకటాద్రిపాలెంకు చెందిన రమేశ్ స్పెషల్ ఫోర్స్ బెటాలియన్‌లో ఉద్యోగం పొందగా అతడిని బీఎల్ఆర్ బ్రదర్స్ అభిమానులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, సాయిరాం, రాంబాబు యాదవ్, నక్క శ్రీనివాస్, ధనమ్మ, బంటు శ్రీనివాస్, శ్యాం, గువ్వల శ్రీను, వెంకన్న, ఆదిలక్ష్మి, ఎల్లమ్మ, లక్ష్మమ్మ, అరుణ, ధనమ్మ, చిట్టెమ్మ, ఈదయ్య, ప్రమీల, పద్మ, సైదమ్మ, బంటు రమేష్, నగేష్, అంజి, ర మావత్ రమేష్, బంటు రాంబాబు, శ్రీను, రమేష్, శివ, సైదులు, శ్రీకాంత్ తదితరులున్నారు.

మహాలక్ష్మీ దేవిగా దుర్గామాత దర్శనం



త్రిపురారం : శివాలయంలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు

త్రిపురారం : దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గా మాతా బుధవారం మహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలో శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజారి లోకేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి మహిళలు సాముహికంగా కుంకుమార్చన చేశారు.

హాలియా : దేవీశరన్నరాత్రి ఉత్సవాల్లో సందర్భంగా అమ్మవారు బుధవారం బాల త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనుముల మండలంలోని కొత్తపల్లి భవానీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి వద్ద బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొండమల్లేపల్లి : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం కొండమల్లేపల్లిలో రామాలయం, కన్యకా పరమేశ్వరి దేవాలయం, త్రిస్టారట పేపర్ ప్లేట్స్ కంపెనీ ఎదుట, బీసీ కాలనీ, దుర్గానగర్, పాత ఊరులో ప్రతిష్ఠించిన దుర్గామాత మండపాల వద్ద అమ్మవారు ధనలక్ష్మి అవతారలో భక్తులకు దర్శనమిచ్చింది.